క్లుప్తంగా

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న పూజారి

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు. మరికొందరు భక్తులు ఆలయ మెట్లకు పసుపు కుంకుమ పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

చిప్పగిరికి చేరిన పాఠ్యపుస్తకాలు



పుస్తకాలను స్టాక్ రూమ్‌లో భద్రపరుస్తున్న సిబ్బంది

చిప్పగిరి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలు, షూష్ ఆదివారం మండలానికి చేరాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఉన్న స్టాక్ రూమ్‌లో వాటిని భద్రపరిచారు. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫామ్స్, షూష్ తదితర సామగ్రి విడతల వారీగా వస్తాయని ఎంఈఓ బాలనాయుడు తెలిపారు. పాఠశాలలు తెరిచే సమయానికి ఆయా హెచ్‌ఎంలకు పంపిణీ చేస్తామని చెప్పారు.

మోటార్ సైకిళ్లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సమీపంలో ఆదివారం రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వెల్దుర్తి మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన మనోజ్ రుద్రవరం మండలంలోని ఆలమూరులో ఉన్న బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఆర్.నాగులవరం సమీపంలో వెళ్తుండగా ఎదురుగా మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై రుద్రవరం వైపు వెళ్తుండగా అదుపు తప్పి రెండు బైక్‌లు ఎదురుగా ఢీ కొన్నాయి. దీంతో మనోజ్‌కు తీవ్ర గాయాలు కాగా..వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న అసోసియేషన్ చైర్మన్ నారాయణరెడ్డి

పత్తికొండ రూరల్: ఎల్‌ఐసీ ఏజెంట్ల సంక్షేమానికి కృషి చేస్తామని ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పత్తికొండ-ఆదోని రోడ్డులోని ఈరన్న స్వామి ఆలయ కల్యాణ మండపంలో పత్తికొండ బ్రాంచ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన కడప డివిజన్ ఎల్‌ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఎల్‌ఐసీ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర కీలకమన్నారు. వారి సమస్యల పరిష్కారానికి పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ జోనల్ అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జయభరత్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



కొట్టుకుపోయిన రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

తుగ్గలి: కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షానికి తెగిపోయిన రోడ్డుకు మరమ్మతులు చేశారు. వర్షానికి తుగ్గలి చెరువు వద్ద రోడ్డు కోతకు గురై తెగిపోయింది. దీంతో మామిళ్లకుంట, కోతికొండ, ఎద్దులదొడ్డి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్అండ్‌బీ డీఈ నాగవెంకటేశ్వరరెడ్డి, ఏఈ లక్ష్మి రోడ్డును పరిశీలించారు. ఆదివారం పైపులు అమర్చి మట్టితో రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. దీంతో యథావిధిగా రాకపోకలు కొనసాగాయి.

స్మార్ట్‌గా పేమెంట్

- ఎక్కడ చూసినా డిజిటల్ లావాదేవీలు
- ఆన్‌లైన్ లావాదేవీలకు ఆదరణ
- కోవిడ్ అనంతరం చెల్లింపుల్లో మార్పులు

ఆలూరు రూరల్: గతంలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు జేబులో డబ్బులు పెట్టుకుని వచ్చేవాళ్లం. బయట పనులపై తరగడానికి ఎంత అవసరం ఉందో ముందే అంచనా వేసుకుని తీసుకువచ్చేవాళ్లం. కానీ ఇప్పుడు కాలం మారింది. అంతా డిజిటల్ మయంగా మారింది. జేబులో రూపాయి లేకపోయినా స్మార్ట్‌ఫోన్, మన ఖాతాలో డబ్బులు ఉంటే చాలు. దానితోనే ప్రతి లావాదేవిని సులభంగా చేయవచ్చు. కావాల్సిన వస్తువులు కొనాలన్నా, నచ్చిన ఫుడ్ తినాలన్నా, డబ్బులు పంపించాలన్నా, తీసుకోవాలన్నా అంతా చిటికెలో అయిపోతుంది. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాలు పెట్టుకున్న చిరు వ్యాపారులు చెంతకు వచ్చేశాయి. పట్టణాలతో పాటు గ్రామాలకు విస్తరించాయి. డిజిటల్ లావాదేవీలకు అవసరమైన స్కానర్ లేకుండా ఏ వ్యాపారి కనిపించడం లేదు.

కోవిడ్ అనంతరం చెల్లింపుల్లో మార్పులు

దేశంలో 2016లో పెద్ద నోట్ల రద్దు జరిగింది. అనంతరం ఆర్థిక లావాదేవీల్లో ఇబ్బందులు అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించారు. కానీ అవి పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితం అయ్యాయి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళుతుందన్న అపోహ, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో స్మార్ట్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలకు చేరలేదు. 2019 కోవిడ్ అనంతరం పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు గణనీయంగా పెరిగి చెల్లింపుల్లో మార్పులు వచ్చాయి.

చిరు వ్యాపారులకు చెంతకు..

టీ స్టాళ్లు, రోడ్డు పక్కన హోటళ్లు, తోపుడు బండ్లు, సైకిల్‌పై వ్యాపారాలు చేసే వారంతా ఆన్‌లైన్ చెల్లింపులు ప్రోత్సహిస్తున్నారు. వీటి వల్ల ప్రధానంగా వ్యాపారులకు చిల్లర సమస్య ఉండడం లేదు. డిజిటల్ పేమెంట్‌తో చిల్లర సమస్యకు పరిష్కారం లభించింది. పేమెంట్ యాప్‌లకు సంబంధించి క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు, బోర్డులు దర్శనమిస్తున్నాయి.



ఆలూరులో చికెన్ షాపు, టీ కొట్టులో కనిపిస్తున్న డిజిటల్ చెల్లింపు స్కానర్లు

అన్ని చోట్ల ఆన్‌లైన్ చెల్లింపులే

ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమోజాన్‌పే తదితర పేమెంట్ యాప్ సేవలతో అన్ని చోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జులు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలా వరకు ఈ యాప్‌ల నుంచి జరుగుతున్నాయి. బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్ ట్రాన్సాక్షన్లు చేస్తూ ఇంటి నుంచి అన్ని రకాల సేవలు పొందుతున్నారు.

స్పీకర్ బాక్సులతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపులకు ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకు గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకు కొనుగోలు చేసిన తర్వాత వేరే వాటికి అమౌంట్ బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ మెసేజ్‌ను చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు ఇలాంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణ యజమాని ఖాతాకి జమ అయ్యిందనే విషయం స్పీకర్‌లో బయటకు వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి రాక

పత్తికొండ రూరల్: మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం ఉదయం పత్తికొండకు వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు ఆదివారం తెలిపారు. స్థానిక నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ఫలితాలపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

పార్టీ నాయకులతో సమావేశం

మద్దికెర: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం సాయంత్రం సమావేశం కానున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ వెంకటేశులు తెలిపారు. మద్దికెరలో సాయంత్రం 4 గంటలకు సమావేశం ఉంటుందని.. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు గణేష్ ఉత్సవ సమితి సమావేశం

పత్తికొండ రూరల్: స్థానిక రెడ్డిబావి వీధిలోని పురాతన శివాలయంలో గణేష్ ఉత్సవ సమితి సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు సమితి నాయకుడు కరణం నరేష్ తెలిపారు. గణేష్ ఉత్సవ నిర్వహణ, నిమజ్జనం తదితర ఏర్పాట్లపై చర్చిస్తామన్నారు. అనంతరం ఆర్డీఓను కలవనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఉత్సవ సమితి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

21న ఎల్లార్తి దర్గాలకు టెండరు

హొళగుంద: ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల ఏడాది నిర్వహణకు ఈ నెల 21న టెండరు నిర్వహిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ రెండు దర్గాలు, 38 రూములు, చందాపట్టి, చర్మ సేకరణ, చక్కెర, హేర్ కటింగ్ తదితర వాటికి సీల్డ్ టెండరును జూన్ 7 నుంచి ఈ నెల 21వ తేది వరకు ఆహ్వానించారు. విజయవాడలో జరిగే సీల్డ్ టెండర్ ఓపెన్‌లో అత్యధికంగా కోట్ చేసిన వారు వేలం దక్కించుకోనున్నారు. వారికి వక్ఫ్ బోర్డు అధికారులు నిర్వహణ గడువును తెలిపి దర్గాలను స్వాధీనం చేస్తారు. కాగా ఈ దర్గాలను 2014లో వక్ఫ్ బోర్డు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో నుంచి స్వాధీనం చేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దర్గాల నుంచి వక్ఫ్ బోర్డుకు రూ. కోట్లలో ఆదాయం వచ్చింది. ఇంత ఆదాయం వచ్చినా తాగునీరు, గదులు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు కరువయ్యాయని భక్తులు ఆరోపిస్తున్నారు.



ఎల్లార్తి దర్గా ముఖద్వారం

తాగునీటి పైపులైన్‌కు లీకేజీ

హాలహర్వి: మండలంలోని బాపురం-ఆలూరు మార్గంలో తాగునీటి పైపులైన్‌లకు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో పెద్ద ఎత్తున తాగునీరు వృథా అవుతోంది. ఆలూరుకు బాపురం రిజర్వాయర్ నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. తాగునీటి పైపులైన్ల లీకేజీ కారణంగా నీటి ఎద్దడి నెలకొంది. రెండు రోజులుగా తాగునీరు వృథా అవుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీ అయిన పైపులైన్లకు మరమ్మతులు చేసి సక్రమంగా తాగునీటిని అందించాలని కోరుతున్నారు.



బాపురం-ఆలూరు రహదారిలో పైపులైన్ లీకేజీతో ఉప్పొంగుతున్న నీరు

బీజేపీ నాయకుల సంబరాలు

హాలహర్వి: మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఆదివారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయడంతో మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు బసవరాజు బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ హయాంలో దేశం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు బంగి, నరసప్ప, కరిడిగుడ్డం నాగరాజు, తిప్పేస్వామి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చైర్మన్ పదవికి రాజీనామా

పెద్దకడబూరు: ఆంధ్రప్రదేశ్ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు చైర్మన్ పదవికి పర్లప్ప గారి భాగ్యమ్మ ఆదివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఓటమికి నైతిక బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజీనామా లేఖను ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా తాను, తన భర్త (మాజీ ఎంపీపీ) రఘురాముడు వైఎస్సార్‌సీపీ వెంట ఉండి పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడకుండా గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కలసికట్టుగా శ్రమిద్దామన్నారు. నాలుగవ సారి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించినందుకు మంత్రాలయం నియోజకవర్గం ప్రజలకు, పెద్దకడబూరు మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

కళాకారులకు సన్మానం

ఆదోని అర్బన్: ఆదోనిలోని మంగళ ఆంజనేయస్వామి ఆలయంలో ఎన్నో సంవత్సరాలుగా స్వామివారికి సేవలు చేస్తున్న కళాకారులను ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు టైలర్ రమేష్, దేవస్థాన అధ్యక్షులు గౌడ్ ఈరన్న ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక ఆలయ ప్రాంగణంలో లలిత కళాసేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ జి.నల్లారెడ్డి, గౌడ్ ఈరన్న, ప్రముఖ సంగీత హార్మోనిస్టు ఉరుకుందప్పలను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాన్ని సుందరంగా నిర్మించిన కళాకారులు ప్రతిభ వెలకట్టలేనిదన్నారు. వారు నిర్మించిన కళ అశాశ్వతమైనదని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, దేవాలయ సభ్యులు ఓంకార్‌గౌడ్, ఈరన్న, రమేష్, మల్లప్ప, కృష్ణ, లక్ష్మయ్య, నాగయ్య, రాముడు, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



ఎమ్మెల్యే విరూపాక్షికి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, పార్టీ నాయకులు

- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

దేవనకొండ: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఆదివారం మొదటిసారిగా దేవనకొండలో పర్యటించారు. నాయకులతో సమావేశమయ్యారు. తొలుత బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని హితవుపలికారు. గతంలో వైఎస్సార్‌సీపీ ఎవరినీ ఇబ్బంది పెట్టలేదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తమ వారి జోలికి వచ్చే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తన గెలుపునకు సహకరించిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు.. ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎవరూ అధైర్యపడవద్దని భవిష్యత్తు మనదేనని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, కో-కన్వీనర్ కబీర్‌దాసు, నాయకులు అరుణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కుల సాధనే లక్ష్యం



ఎస్టీయూ జెండాను ఆవిష్కరించిన యూనియన్ నాయకులు

ఆలూరు: ఉపాధ్యాయుల హక్కుల సాధనే లక్ష్యంగా ఎస్టీయూ నాయకత్వం పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు నాగరాజ్ అన్నారు. ఆదివారం ఆలూరు ఎమ్మార్సీ ఆవరణలో 78వ వార్షికోత్సవం సందర్భంగా ఎస్టీయూ జెండాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు తిమ్మప్ప, గిరయ్య, రవిశంకర్, ఉరుకుందప్ప తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడికి ప్రభుత్వం నుంచి రావాల్సిన జీత భత్యాలు, పీఆర్‌సీ, జీపీఎఫ్, హెల్త్‌కార్డులు తదితర వాటిని సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూసఫ్, సూర్యనారాయణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మంత్రాలయం: మంత్రాలయం నది తీరాన బండరాళ్ల వద్ద ఆదివారం గుర్తు తెలియని మగ శవం పడిఉంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గోపీనాథ్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మృతుడిని గుర్తు పట్టడానికి ఆయన దగ్గర ఎలాంటి ఆధారాలు గానీ, ఐడీ కార్డులు గానీ లేవన్నారు. ఎర్ర పంచ, ఎర్రని డ్రాయరు, ఎర్రని చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



ఆస్పరిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1991-92లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాబురెడ్డి, గోవిందరాజులు, అక్బర్ బాషా, మస్తాన్, సంజప్ప, రంగస్వామి, సుధాకర్‌శెట్టి, శేఖర్, బసవరాజమ్మ, రాజేశ్వరి, గంగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



చిగిళి గ్రామంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆస్పరి: మండలంలోని చిగిళి బీసీ కాలనీ రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్డు మొత్తం వాననీటితో బురదమయంగా మారింది. ఇళ్లలోకి మురుగునీరు చేరుతోంది. అటు వైపు వెళ్లడానికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. మురుగు కాలువలు, సిమెంట్ రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంపద సృష్టిపై నిర్లక్ష్యపు నీడ

- నీరు గారుతున్న పథకం లక్ష్యం
- వృథా అవుతున్న ప్రజా ధనం



నగరడోణ గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం



నంచర్లలో..

చిప్పగిరి: గ్రామాల్లోని చెత్తను సేకరించి దాన్ని ఎరువుగా తయారు మార్చి సంపద సృష్టించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రం చిప్పగిరితో పాటు కుందనగుర్తి, నగరడోణ, రామదుర్గం, బంటణహాళ్, డేగులహాలు, నంచర్ల గుమ్మనూరు, తదితర గ్రామాల్లో సుమారు రూ. 30 లక్షల నిధులతో ఈ కేంద్రాలు నిర్మించారు. బెల్డోణ, ఏరూరు, నేమకల్, దౌల్తాపురం తదితర గ్రామాల్లో రూ. 19 లక్షల నిధులతో చెత్త సంపద కేంద్రాలు నిర్మిస్తున్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించి వాన పాముల ద్వారా ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చనే ఉద్దేశంతో ఈ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వినియోగించక పోవడంతో మందు బాబులకు అడ్డగా మారి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి. ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కుందనగుర్తి గ్రామంలో..

చిన్నహరివాణంలో ఇరువర్గాల ఘర్షణ

- ముగ్గురికి గాయాలు
- ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్యాభర్తలు ఈశ్వరమ్మ, వీరభద్రారెడ్డి

ఆదోని టౌన్: ఆదోని మండలం చిన్న హరివాణం గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఈశ్వరమ్మ, వీరభద్రారెడ్డి, వారి తనయుడు వీరేష్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గిరిరెడ్డి, ఆనందరాజ్, శాంతరాజ్, నరసన్నతో పాటు మరి కొంతమంది ఆదివారం దాడులు చేశారు. గాయపడిన వీరభద్రారెడ్డి, ఈశ్వరమ్మ, వీరేష్‌రెడ్డిలను వారి బంధువులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బాధితుడు విలేకరులకు తెలిపిన వివరాల మేరకు.. చిన్నహరివాణం గ్రామంలో కొంతకాలంగా శివశంకర్‌రెడ్డి, వీరేష్‌రెడ్డి కుటుంబాల మధ్య ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. అయితే ఆదివారం శివశంకర్‌రెడ్డి తన అనుచరులతో ఏకంగా వీరేష్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించారు. దాడిని అడ్డుకోబోయిన అతని తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, వీరభద్రారెడ్డిలపై దాడి చేశారు. శివశంకర్‌రెడ్డి చేసిన దాడిలో తల్లి, తండ్రి, కొడుకులకు రక్త గాయాలయ్యాయి. 'ప్రభుత్వం మాది. మేము చెప్పిన విధంగా వినాలి, లేదంటే పరిస్థితులు వేరుగా ఉంటాయని హెచ్చరించినట్లు బాధితుడు వీరేష్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. తమకు సంబంధించిన స్థలాన్ని ఇప్పించాలని అభ్యర్థించారు.